

వినాయక్‌నగర్‌లో సీవరేజ్ లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్

# సీవరేజ్ లైన్ పనులు పరిశీలన

బంజారాహిల్స్,డిసెంబర్ 18: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో చేపట్టిన సీవరేజ్ లైన్ పనులను కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ సోమవారం పరిశీలించారు. బస్తీలో మురుగు సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన పనులు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయని, కోడ్ ముగియడంతో పనులను ప్రారంభించామని కార్పొరేటర్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఇతర బస్తీల్లో సైతం పెండింగ్ పనులు త్వరలోనే పూర్తిచేయిస్తామని పేర్కొన్నారు. జలమండలి మేనేజర్ పవన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మెక్లాడ్‌గూడలో బోర్‌వెల్స్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుచిత్ర

# సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి

బేగంపేట్ డిసెంబర్ 18: రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని రాంగోపాట్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. సోమవారం డివిజన్‌లోని మెక్లాడ్‌గూడలో ఎంపీ నిధులతో రెండు బోర్‌వెల్స్ పనులను ఆమె ప్రారంభించారు. ఇందులో ఒక బోర్‌వెల్ పనులు పూర్తి కాగా మరో బోర్‌వెల్స్ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. దీంతో పాటు పీజీ రోడ్డులో జలమండలి అధికారులతో మాట్లాడి కలుషిత నీటి సమస్యను కూడా పరిష్కరించినట్టు వారు తెలిపారు.



# ఎమ్మెల్యే దానంకు అభినందనలు

ఖైరతాబాద్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్‌ను సోమవారం సోమాజిగూడ బీఆర్‌ఎస్ డివిజన్ మహిళా ఉపాధ్యక్షురాలు నాగమణి నేతృత్వంలో మహిళా నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు సాయిబాబా చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాగమణి, సునీత, వరలక్ష్మి, లక్ష్మి, రాణి, నాగలక్ష్మి తదితరులున్నారు.

– ఖైరతాబాద్, డిసెంబర్ 18

## సీవరేజ్ లైన్‌లోకి ఆహారవ్యర్థాలు, కుళ్లిన పదార్థాలు

- నూనె పదార్థాలు రోడ్డుపై పొంగడంతో ప్రమాదాలు
- జూబ్లీహిల్స్‌లోని అంతెరా రెస్టారెంట్‌కు జలమండలి నోటీసులు

బంజారాహిల్స్, డిసెంబర్ 18: డ్రైనేజీ లైన్‌లోకి కిచెన్ వ్యర్థాలు, పాడైపోయిన ఆహారపదార్థాలను వదిలిపెట్టిన రెస్టారెంట్ నిర్వాహకులకు జలమండలి అధికారులు నోటీసులు జారీ చేశారు. అధికారుల కథనం ప్రకారం.. జూబ్లీ హిల్స్ రోడ్డు నంబర్ 10లోని అంతెరా రెస్టారెంట్ ఎదురుగా సోమవారం తెల్లవారుజామున సీవరేజ్ లైన్ పొంగింది. సీవరేజ్ లైన్ నుంచి పెద్ద ఎత్తున వంటనూనెతో పాటు మాంసం ముక్కలు, కుళ్లిపోయిన ఆహారపదార్థాలు బయటకు రావడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మ్యాన్‌హోల్ నుంచి ఆయిల్ బయటకు పొంగడంతో రోడ్డుపై వెళ్తున్న బైక్‌లు స్కిడ్ అయ్యి పలువురు కిందపడి గాయాల పాలయ్యారు. కమలాపురి కాలనీకి చెందిన దీపిక అనే మహిళ తన కూతురితో పాటు స్కూటీపై వెళ్తూ అంతెరా వద్ద బైక్ స్కిడ్ కావడంతో కిందపడిపోయింది. ఆమె తలకు గాయాలవ్వడంతో ఆస్పత్రిలో చేరింది. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న జలమండలి జీఎం హరిశంకర్ ఆదేశాలతో వాటర్‌వర్క్స్ డీజీఎం శ్రీనివాసులు, మేనేజర్ పవన్ తదితరులు సిబ్బందితో జూబ్లీహిల్స్‌లోని అంతెరా రెస్టారెంట్ వద్దకు చేరుకున్నారు. మ్యాన్‌హోల్స్‌ను క్లీన్ చేయించారు. ఆ తర్వాత రెస్టారెంట్‌కు సంబంధించిన సీవరేజ్ లైన్‌ను పరిశీలించగా.. వ్యర్థాలన్నీ నేరుగా సీవరేజ్ లైన్‌లో చేరుతున్నాయని గుర్తించారు. ఘన వ్యర్థాలను, కిచెన్ వ్యర్థాలను ఫిల్టర్ చేయడానికి సిల్ట్ చాంబర్ లేకపోవడాన్ని సీరియస్‌గా తీసుకున్న జలమండలి అధికారులు.. రెస్టారెంట్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోగా సిల్ట్ చాంబర్ నిర్మాణం చేసుకోవడంతో పాటు వ్యర్థాలను సీవరేజ్ లైన్‌లోకి రాకుండా చూసుకోకుంటే కఠిన చర్యలు తప్పవని నోటీసు ద్వారా హెచ్చరించారు. అన్ని రెస్టారెంట్లకు సంబంధించిన సీవరేజ్ లైన్లను పరిశీలించి.. సిల్ట్ చాంబర్లు లేని వాటిపై చర్యలు తీసుకుంటామని జలమండలి జీఎం హరిశంకర్ తెలిపారు.

# చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి

## బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు



ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్రాజు

బేగంపేట్ డిసెంబర్ 18: పిల్లలకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్రాజు అన్నారు. సోమవారం బేగంపేట్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ కేంద్రంలో హీరో మోటార్స్ వారి ఆధ్వర్యంలో గీతాంజలి పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. అ సందర్భంగా ఏసీపీ శంకర్రాజు మాట్లాడుతూ... రోడ్డు భద్రత నియమాల గురించి బోధనాంశాల్లో కూడా చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలు రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు.

# మెగా డీఎస్సీలో పీఈటీ, పీడీ పోస్టులను పెంచాలి: శాగంటి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 18: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న మెగా డీఎస్సీలో పీఈటీ, పీడీ పోస్టులను పెంచాలని స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్‌ఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి రాజేశ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మెగా డీఎస్సీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల సంఖ్యను తక్కువగా చూపించినందుకు నిరసనగా ఎస్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. మెగా డీఎస్సీలో వ్యాయామ విద్యకు సంబంధించి 162 పోస్టులనే చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ విద్యాసంస్థల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఎఫ్ నాయకులు వినోద్, సతీశ్‌గౌడ్, గణేశ్, ప్రదీప్, సురేశ్, పృథ్వీ, నరేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం: వీ ఫర్ వుమెన్ సంస్థ మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బేగంపేట్‌లోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీ ఫ్లై ఓవర్ కింద ఉన్న షెల్టర్ ఫర్ హోమ్‌లెస్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హోమ్‌లో ఉన్న వారికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. దీంతో పాటు సంస్థ ఆధ్వర్యంలో వారికి దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీ ఫర్ వుమెన్ సంస్థ వ్యవస్థాపకురాలు, గాంధీ ఆసుపత్రి మెడికల్ కాలేజ్ అసోసియేషట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బేగంపేట్ డిసెంబర్ 18:

# మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

బంజారాహిల్స్,డిసెంబర్ 18: మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన గజానన్ మాస్కే(40) ఆరేళ్ల క్రితం బతుకుదెరువుకోసం కుటుంబంతో సహా నగరంలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్12లోని ఎన్‌బీటీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న గజానన్ గత కొంతకాలంగా మద్యానికి బానిసవ్వడంతో పాటు సరిగా పనికి వెళ్లడం లేదు. దీంతో భార్య అర్చనతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో ఇంటికొచ్చిన గజానన్ తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు భార్య అర్చన ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# గంజాయి విక్రయిస్తున్న ఆటో డ్రైవర్ అరెస్ట్

బంజారాహిల్స్: జల్సాలకు అలవాటు పడిన ఆటో డ్రైవర్ గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌లోని కోట ప్రాంతానికి చెందిన మహ్మద్ అఖ్లాక్ (40) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి గోల్కొండ సమీపంలోని కటోరా హౌస్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న అఖ్లాక్ కొంతకాలంగా మద్యంతో పాటు చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. జల్సాల కోసం డబ్బులు సరిపోకపోవడంతో మంగళ్‌హాట్ నుంచి గంజాయి తీసుకొచ్చి అమ్ముతూ డబ్బులు సంపాదిస్తున్నాడు. ఈ క్రమంలో టోలీచౌకి సమీపంలోని సమతా కాలనీలో ఆటోస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న అఖ్లాక్‌ను ఫిలింనగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు ఇచ్చాడు. అతడివద్ద సోదా చేయగా 200 గ్రాముల గంజాయి దొరికింది. అఖ్లాక్ మీద ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.



# దివ్యాంగులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

అంతర్జాతీయ డిసాబుల్ డే ను పురస్కరించుకొని రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని బాటనీ దివ్యాంగుల పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కార్పొరేటర్ సుచిత్ర సొంత నిధులతో స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చీర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

– బేగంపేట, డిసెంబర్ 18

# కేసులకు దారి తీసిన క్రికెట్ పంచాయితీ

బంజారాహిల్స్,డిసెంబర్ 18: రోడ్డుమీద వెళ్తున్న వ్యక్తులకు దెబ్బ తగిలేలా క్రికెట్ ఆడుతున్న పిల్లలను మందలించిన వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని నూర్‌నగర్‌లో నివాసం ఉంటున్న శాంతిబాబు అనే వ్యక్తి ఆదివారం రాత్రి రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు పిల్లలు క్రికెట్ ఆడుతున్నారు. వేగంగా వచ్చిన బంతి శాంతిబాబుకు తగలడంతో వారిని మందలించాడు. దాంతో వాళ్లు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. పిల్లల కుటుంబ సభ్యులు అక్కడకు వచ్చి శాంతిబాబును క్రికెట్ బ్యాట్‌తో కొట్టగా అతడికి గాయలయ్యాయి. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. కాగా క్రికెట్ ఆడుతున్న తమ కొడుకును అకారణంగా మందలించడంతో పాటు దాడి చేశారంటూ సయ్యద్ జబ్బార్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో శాంతిబాబు మీద కూడా కేసు నమోదైంది.

# నిర్లక్ష్యంగా డ్రైవింగ్..ఆపై దాడి

బంజారాహిల్స్,డిసెంబర్ 18: నిర్లక్ష్యంగా వాహనం నడిపిస్తూ ఢీకొట్టడమే కాకుండా స్నేహితులతో కలిసి దాడి చేసిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లోని నందినగర్‌కు చెందిన వి.మాదవ్‌రావు తన బావమరిది రాజశేఖర్‌తో పాటు అతడి కుమార్తెతో కలిసి ఆదివారం రాత్రి ఆస్పత్రికి వెళ్తున్నారు. జహీరానగర్ చౌరస్తావద్దకు రాగానే అతివేగంగా బైక్‌మీద వచ్చిన నబీలుద్దీన్ ఢీకొట్టాడు. దీంతో మాదవరావుకు గాయాలయ్యాయి. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాసేపట్లోనే నబీలుద్దీన్ తన స్నేహితులు అబ్దుల్ రహ్మాన్, నాయబుద్దీన్, ముదస్సర్ తదితరులను అక్కడకు పిలిపించి మాదవరావు మీద దాడి చేసి పారిపోయారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో నిందితులపై ఐపీసీ 341, 323, 506, 337 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వెలమ పేద విద్యార్థులకు తోడ్పాటునందించాలి

హిమాయత్‌నగర్: వెలమ సమాజంలో ఉన్న పేద విద్యారులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థికంగా తోడ్పాటునందించాలని ఐవా అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమనేని పాపారావు కోరారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ కార్యాలయంలో విద్యాదాన నిధి స్కాలర్‌షిప్ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేద విద్యార్థులు మధ్యంతరంగా విద్యను నిలిపివేస్తున్నారని,అలాంటి వారిని వెలమ సంఘాల నుంచి గుర్తించి బాసటగా నిలువాలని సూచించారు.